హైదరాబాద్
13-10-2023
సంపుటి:08
సంచిక: 368
పేజీలు: 4
వెల: రూ.5/-
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## కేసీఆర్ ఆటలో బలిపశువులు హరీశ్, రేవంత్‌లే!

### బీజేపీ అభ్యర్థుల జాబితా ఢిల్లీకి..

- కాంగ్రెస్ లిస్ట్ ప్రగతిభవన్‌లోనే..: బండి సంజయ్
- బీఆర్ఎస్ అవినీతి సొమ్మును కక్కిస్తాం: కిషన్‌రెడ్డి
- ఆ 2 పార్టీలకు బీసీల ఓట్లడిగే హక్కు లేదు: లక్ష్మణ్
- ఇక్కడా.. అక్కడా పోటీకి దిగుతా!
- కేసీఆర్‌ను ఓడించడమే నా ఆశయం
- నాకు భయపడే దళితబంధు, బీసీ బంధు: ఈటల


2లో

## పదేళ్ల అభివృద్ధితో ప్రజల్లోకి..

**పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలతో కేటీఆర్**

**అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతీ గడపకు తీసుకెళ్లాలని పిలుపు**

హైదరాబాద్: బీఆర్ఎస్‌కు అన్ని నియోజకవర్గాల్లో సానుకూల వాతావరణం ఉందని, పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతీ గడపకు తీసుకెళ్లాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సూచించారు. ఎన్నికల సమన్వయం కోసం నియమించిన 54 మంది నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జిలతో మంత్రి హరీశ్‌రావుతో కలిసి కేటీఆర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన కార్యాచరణపై ఇన్‌చార్జిలకు దిశా నిర్దేశం చేశారు. పదేళ్ల పాలనలో సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుకున్న ప్రతీ ఒక్కరితో మమేకమయ్యేలా పార్టీ ప్రచారాన్ని నిర్వహించాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీలకు ఎన్నికలు కేవలం



# మేం రాగానే మిత్తితో చెల్లిస్తాం

- కాంగ్రెస్‌కు సాయం చేస్తున్న 75మంది జాబితాను
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు అందజేశారు
- వారిలో కొందరిని స్వయంగా కేటీఆరే బెదిరిస్తున్నారు
- అంజనీకుమార్‌ను డీజీపీగా తొలగించాలి: రేవంత్
- హస్తం గూటికి ఎల్బీనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి
- రామ్మోహన్, మాజీ మావోయిస్టు అశోక్, మరికొందరు

హైదరాబాద్, "కాంగ్రెసకు సాయం చేస్తున్న 75 మంది జాబితాను తయారుచేసిన కేటీఆర్.. దాన్ని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు ఇచ్చారు. వారిలో కొందరిని కేటీఆరే స్వయంగా బెదిరిస్తున్నారు. బిడ్డా కేటీఆర్.. గుర్తుపెట్టుకో.. నీ అధికారం 45 రోజులే.. ఆ తరువాత కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది.. ఆ వెంటనే ఇంతకు ఇంత మిత్తితో చెల్లిస్తాం" అని పీసీసీ చీఫ్ రేవంత్ హెచ్చరించారు. కాంగ్రెసకు సాయం చేసే వారిని బెదిరిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, ఆయన సతీమణి, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న, కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ అసంతృప్త నేత శ్రీ గణేష్, పరిగి నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి కమతం రాంరెడ్డి కుమారుడు కమతం శ్రీనివాసరెడ్డి, తాండూరు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, సునీత సంపత్, డీసీసీ మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి కుమారుడు మహిపాల్‌రెడ్డి, సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట ఎంపీపీ ఉట్కూరి వెంకటరమణారెడ్డి, మానకొండూర్ ఎంపీపీ ముద్దసాని సులోచన, భూపాలపల్లి జిల్లాకు చెందిన మావోయిస్టు మాజీ నేత గాజర్ల అశోక్ అలియాస్ ఐతుతోపాటు పలువురు నేతలు గురువారం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ


2లో

## కేసీఆర్‌పై పోటీ చేస్తా!

- హుజూరాబాద్ బరిలో కూడా ఉంటా..
- రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ రాదు
- 16న హుజూరాబాద్‌కు కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాక
- బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

హుజూరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గంతోపాటు.. అక్కడ కూడా పోటీ చేస్తానని (పరోక్షంగా సీఎం కేసీఆర్‌పై) బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. తనను హుజూరాబాద్‌లో గెలిపించేందుకు కథానాయకులుగా మారి బీజేపీ శ్రేణులు పనిచేయాలని కోరారు. గురువారం ఆయన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నియోజకవర్గ స్థాయి బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 'నేను ఆరు ఫీట్ల హైట్ లేకపోవచ్చు,

2లో



## చంద్రబాబుకు స్కిన్ అలర్జీ

**ఎండ వేడిమి, ఉక్కపోతే కారణం**

**ఇద్దరు చర్మవ్యాధి నిపుణులతోవైద్య పరీక్షలు**

**బాబు ఆరోగ్యం బాగుందని జైలు అధికారుల వెల్లడి**

రాజమహేంద్రవరం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో జ్యుడిషియల్ రిమాండ్ అనుభవిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు చర్మ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. కొన్ని రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. తీవ్ర ఎండ, ఉక్కపోత కారణంగా అలర్జీతో ఇబ్బందులు పడుతున్నట్టు తెలిసింది. ఇదే విషయాన్ని చంద్రబాబు జైలు అధికారుల

2లో



## గాజా.. గజగజ

**బేకరీలు, దుకాణాల వద్ద జనం బారులు**

**హమాస్‌కు మరో దెబ్బ.. కీలక నేత హతం**

**గాజాలో గ్రౌండ్ యాక్షన్‌కు ఐడీఎఫ్ సిద్ధం**

**హమాస్‌ను భూస్థాపితం చేస్తాం: బెంజమిన్**

జెరూసలేం, అక్టోబరు 12: పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ హరాకత్ అల్–ముక్వామా అల్–ఇస్లామియా(హమాస్) పరిపాలిస్తున్న గాజా ఇప్పుడు ఇజ్రాయెల్ ముప్పేట దాడులతో దిక్కుతోచని స్థితిలో ఉంది. కరెంటు లేక కకావికలమవుతోంది. అన్నపానీయాలు దొరక్క ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఏ క్షణంలో ఎక్కడి నుంచి బాంబులు పడతాయోనని గజగజ వణుకుతున్నారు. విలువైన వస్తువులు, తట్టాబుట్ట సర్దుకుని.. ఐక్యరాజ్య సమితి(ఐరాస) శిబిరాలకు తరలుతున్నారు. హమాస–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ఆరో రోజు గాజాలో కనిపించిన దృశ్యాలివి..! ఐదు రోజులుగా మూసి ఉన్న దుకాణాలు గురువారం ఉదయం కొంత సేపు తెరుచుకోగా.. ఆహార పదార్థాల కొనుగోలుకు జనాలు బారులు తీరారు. బేకరీలు, పచారీ కొట్ల వద్ద క్యూలు కట్టారు. రాబోయే రోజుల్లో యుద్ధం తీవ్రత మరింత

# అక్కచెల్లెమ్మలకళ్లల్లో సంతోషాన్ని చూస్తున్నా..

**పేదల ఇళ్ల కోసం 72 వేల ఎకరాలను సేకరించాం**

**ఇళ్ల స్థలాల కోసమే ఏకంగా రూ.75 వేల కోట్లు వ్యయం**

**30.75 లక్షల మంది అక్కచెల్లెమ్మల పేరుతో పట్టాలిచ్చాం**

**రాష్ట్రవ్యాప్తంగా 17 వేల వైఎస్సార్ జగనన్న కాలనీలు**

**తొలివిడతగా సిద్ధమైన 7.43 లక్షల ఇళ్లలోకి సామూహిక గృహ ప్రవేశాలు**

**శరవేగంగా కొనసాగుతున్న మరో 14.33 లక్షల గృహ నిర్మాణాలు**

**బాబు హయాంలో సొంత ఇళ్లు లేని నిరుపేదలు కోటి మందికి పైనే**

**కనీసం కుప్పంలోనైనా ఎవరికైనా సెంటు భూమి ఇచ్చాడా?**

**పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలివ్వకుండా కేసులతో అడ్డుపడ్డారు**

**రాష్ట్రంతో బాబు బంధం ఇదీ..**



సామర్లకోట "నిరుపేద అక్కుచెల్లెమ్మల కళ్లల్లో ఎనలేని సంతోషాన్ని చూశా. బహుశా దేశ చరిత్రలో ఎక్కడా జరగని మహాయజ్ఞం పేదల సొంతింటి కలను మనం సాకారం చేశాం. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 31 లక్షల కుటుంబాల్లో అంటే రాష్ట్ర జనాభాలో 20 శాతం పైచిలుకు ఉన్న ఇళ్లు లేని నిరుపేదల ముఖాల్లో చిరునవ్వులు చూడాలని తాపత్రయపడ్డా. మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారికి మంచి చేశాం. దేవుడి దయతో నా పేద అక్కచెల్లెమ్మలకు దాదాపు 31 లక్షుల ఇళ్ల ముట్టులు ఇవ్వడంతో పాటు దాదాపు 22 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. రాష్ట్రవ్యాప్తంగా దాుదాపు 13 వేల గ్రామ పంచాయతీలు ఉంటే ఈ రోజు 17 వేల వైఎస్సార్ జగనన్న కాలనీలు వస్తున్నాయి. కాసేపటి క్రితం ఇక్కడ కాలనీలలో ఇళ్లను చూశా. అవి ఇళ్లు కాదు ఊళ్లు అని గర్వంగా చెబుతున్నా. ఇవాళ్టి వరకు రాష్ట్రవ్యాప్తంగా 7.43 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి మీ బిడ్డగా మీతో ఆనందాన్ని పంచుకుంటున్నా" అని సీఎం వైఎస్ జగన్ సంతోషం వ్యక్తం చేశారు. 'నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు'

2లో

# గాజా.. గజగజ

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువగా ఉంటుందని, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస(ఐడీఎఫ్) గాజాలోకి చొచ్చుకువస్తుందనే వార్తలతో ప్రజలు ఆహార పదార్థా ల నిల్వకు ప్రయత్నాలు చేయడం వంటి వీడియోలు వైరల్ అవుతున్నాయి. పునరావాస కేంద్రం వద్ద తాకిడి విపరీతంగా ఉందని ఐరాస వర్గాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్ దాడుల్లో 1,350 మంది పౌరులు చనిపోయారని, 3 లక్షల మంది నిరాశ్రయులయ్యారని పేర్కొన్నాయి. ఆరో రోజు ఇజ్రాయెల్ జరిపిన రాకెట్ దాడుల్లో హమాస్ కీలక నేత మూసా నాసిర్ హతమైనట్లు ఐడీఎఫ్ వర్గాలు వెల్లడించాయి. "మేము కేవలం గాజాలోని ఉగ్రవాద స్థావరాలనే టార్గెట్‌గా చేసుకున్నాం. పౌరుల ఇళ్లలోంచి ఉగ్రవాద నెట్‌వర్క్ ఉన్న టన్నెల్స్‌కు మార్గాలున్నాయి. అలాంటి వాటిని గుర్తించి, రాకెట్ దాడులు చేస్తున్నాం. గాజాలో ని ఆస్పత్రులను టార్గెట్ చేసుకోలేదు. కరెంటు లేకు న్నా.. ఆస్పత్రుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లున్నాయని గుర్తించాం. జనరేటర్లు పనిచేయడానికి ఇంధనం కావాలనే ఉద్దేశంతో.. గాజాలోని ఏ ఒక్క పెట్రోల్ బంకుపైనా దాడి చేయలేదు" అని ఐడీఎఫ్ వర్గాలు వివరించాయి. గురువారం ఒక్కరోజే గాజాపై 6 వేల రాకెట్లతో దాడులు చేశామని, 3,600 టార్గెట్లను ధ్వంసం చేశామని చెప్పాయి. హమాస్ దాడుల్లో మరణించిన పౌరుల వివరాలను గుర్తించి, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని వెల్లడించాయి. పౌరుల బయోమెట్రిక్ డేటాబేస్ ప్రభు త్వం వద్ద ఉందని, ఆ డేటాబేసతోపాటు.. డీఎన్ఏ ఆధారంగా మృతులను గుర్తిస్తున్నామని తెలిపాయి. ఆరు రోజులుగా సరిహద్దులు, సముద్రం నుంచి వైమానిక, శతఘ్ని దాడులు చేస్తున్న ఇజ్రాయెల్.. గాజా ముట్టడికి గ్రౌండ్ యాక్షన్‌కు దిగేందుకు సిద్ధమైంది. 3.6 లక్షల రిజర్వ్ బలగాల్లో సింహభాగాన్ని గాజాస్ట్రిప్ సరిహద్దుల్లో మోహరించింది. ప్రభుత్వ ఆదేశాలే తరువాయి అని.. ఆ వెంటనే రంగంలోకి దిగి, గాజాలోని ప్రతి ఇంటినీ జల్లెడపడుతామని ఐడీఎఫ్ పేర్కొంది. అయితే.. మాయానగరం లాంటి గాజాలోని భూగర్భ సొరంగాల నెట్‌వర్క్‌ను ఛేదించడం, బందీలను విడిపించడం అంత సులభమైన పని కాదని అమెరికా నిఘా సంస్థ సీఐఏ డైరెక్టర్ లియోన్ పనెట్ట పేర్కొన్నారు. మరోవైపు.. అమెరికా రక్షణ మంత్రి ఆంటోని బ్లింకెన్ గురువారం ఇజ్రాయెల్ చేరుకున్నారు.

# పదేళ్ల అభివృద్ధితో ప్రజల్లోకి..

(మొదటి పేజీ తరువాయి)

హామీలిచ్చేందుకు వేదికలు మాత్రమేనని, బీఆర్ఎస్‌కు మాత్రం తాము చేసిన అభివృద్ధిని వివరించే అద్భుత అవకాశమన్నారు. ఇన్‌చార్జిలు తక్షణమే రంగంలోకి దిగి ఎన్నికల ఫలితాలు వెలువడేంత వరకు బాధ్యత తీసుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

**సహకారం అందించండి: హరీశ్**

రాబోయే 45 రోజులపాటు నియోజకవర్గంలోనే ఉంటూ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. క్షేత్రస్థాయిలో బూత్ కమిటీల నిర్వహణ మొదలుకొని నియోజకవర్గ స్థాయి వరకు అన్ని దశల్లో ప్రచారం పకడ్బందీగా ఉండేలా సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధిస్తుందని, ఆ దిశగా ఈ 45 రోజులపాటు విస్తృతంగా పనిచేయాలని ఇన్‌చార్జిలకు హరీశ్ విజ్ఞప్తి చేశారు.

# చంద్రబాబుకు స్కిన్ అలర్జీ

(మొదటి పేజీ తరువాయి)

దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన జైలు అధికారులు రాజమండ్రిలోని బోధనాస్పత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ మహాలక్ష్మికి సమాచారం ఇచ్చారు. వైద్యులను పంపాలని లేఖలో కోరారు. వెంటనే స్పందించిన జీజీహెచ్ సూపరింటెండెంట్ ఇద్దరు చర్మ సంబంధిత వ్యాధి నిపుణులను కేటాయించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.సూర్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్.సునీతాదేవి సెంట్రల్ జైలుకు వెళ్లి చంద్రబాబుకు వైద్య పరీక్షలు చేపట్టారు. పరీక్షల అనంతరం వైద్యులు ఎలాంటి వివరాలు వెల్లడించకుండా తిరిగి జీజీహెచ్‌కు వెళ్లిపోయారు. వైద్య పరీక్షల్లో వెల్లడైన ఆరోగ్య పరిస్థితిపై ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్టు సమాచారం. సెంట్రల్ జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. చంద్రబాబుకు అలర్జీ ఉందని చెప్పడంతో చర్మ వైద్యుల్ని పిలిపించి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు. అవసరమైన మందులు సూచించినట్టు వెల్లడించారు. వైద్యులు చెప్పిన మందులను చంద్రబాబుకు అందజేసినట్టు చెప్పారు.

**హెల్త్ బులెటిన్ విడుదల**

చంద్రబాబు చర్మ వ్యాధి బారినపడిన నేపథ్యంలో జైలు అధికారులు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు. బీపీ 140/80 ఎంఎంహెచ్‌జీ, టెంపరేచర్ నార్మల్‌గా ఉందన్నారు. పల్స్ రేట్ 87 (నిమిషానికి) ఉందని, ఊపిరితిత్తుల్లో ఎలాంటి సమస్య లేదని వెల్లడించారు. చంద్రబాబు ఆరోగ్యంపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

# 'జమిలి'ని జనంపై రుద్దొద్దు

న్యూఢిల్లీ, అక్టోబరు 12: లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిపే అంశంపై తొలుత జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం సాధించాలని కేంద్ర ఎన్నికల మాజీ ప్రధాన కమిషనర్ ఎస్‌వైఎస్ ఖురేషీ అన్నారు. ఏకాభిప్రాయం రాకుంటే జమిలి ఎన్నికలను ప్రజలపై రుద్దకూడదని గురువారం ఓ ఇంటర్వ్యూలో స్పష్టంచేశారు. జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సార?థ్యంలోని ఉన్నత స్థాయి కమిటీ అధ్యయనం చేస్తున్న నేపథ్యంలో ఖురేషీ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. 2010 జూలై నుంచి 2012 జూన్ వరకు ఆయన సీఈసీగా పనిచేసిన సంగతి తెలిసిందే. తన కొత్త పుస్తకం 'ఇండియాస్ ఎక్స్‌పెరిమెంట్ విత్ డెమోక్రసీ: ది లైఫ్ ఆఫ్ ఏ నేషన్ త్రూ ఇట్స్ ఎలక్షన్స్'పై ఖురేషీ సదరు ఇంటర్వ్యూలో మాట్లాడారు. జమిలి ఎన్నికలపై గతంలోనూ చాలా చర్చ జరిగిందన్నారు. దానితో లాభాలతో పాటు నష్టాలు కూడా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఈ అంశంపై తాను అనేక వ్యాసాలు రాశానని.. కొత్త పుస్తకంలో వాటిలో కొన్నిటిని పొందుపరిచానని తెలిపారు. లాభనష్టాలు రెంటి గురించీ వివరించానని.. తప్పో ఒప్పో చెప్పలేదన్నారు. జమిలి ఎన్నికల వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయని, అదే సమయంలో నష్టాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి మాత్రమే ఎన్నికలు నిర్వహించడం అనేది మంచి ఆలోచన అని చెప్పారు.

# కేసీఆర్ ఆటలో బలిపశువులు హరీశ్, రేవంత్‌లే!

హైదరాబాద్, సీఎం కేసీఆర్ ఆడుతున్న డ్రామాలో చివరకు మంత్రి హరీశ్ రావు, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బలి పశువులు కాబోతున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.సీఎం పదవి కోసం ప్రగతిభవన్‌లో కేటీఆర్, హరీశ్ రావు మధ్య కొట్లాట నడుస్తోందని.. దాంతో కేసీఆర్ ఇబ్బంది పడుతున్నారన్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మానకొండూరు మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, వికారాబాద్ జిల్లా పరిగికి చెందిన వన్నె ఈశ్వరప్పతో పాటు పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. "బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటే. బీజేపీ గ్రాఫ్‌ను తగ్గించేందుకు రెండూ కలిసే కుట్ర చేస్తున్నయి. బీజేపీకి అభ్యర్థుల జాబితా ఇప్పటికే ఢిల్లీకి పోయింది. కానీ కాంగ్రెస్ లిస్ట్ మాత్రం ఇంకా ప్రగతిభవన్‌లో ఉంది పెద్ద సారు (కేసీఆర్) ఆమోదం కోసం వేచి చూస్తున్నరు.. ఆయన 30 మంది అభ్యర్థుల పేర్లు చెప్పి ఆమోదముద్ర వేసినంక ఢిల్లీకి పోతది. తెరవెనుక ఏం జరుగుతుందో పాపం రేవంత్ రెడ్డికి తెల్వదు. ఈ మొత్తం ఎపిసోడ్‌లో హరీశన్న, కాంగ్రెసలో రేవంతన్న బలి కా బ్రకా (బలిపశువులు) కాబోతున్నరు. కేసీఆర్ డ్రామాలాడుతున్నడు. పార్టీ మ్యానిఫెస్టో గురించి చర్చించేందుకే కేటీఆర్, హరీశ్ ప్రగతిభవన్‌కు పిలిచినట్లు చెబుతున్నరు.. కానీ అసలు కథేంటంటే సీఎం పదవి కోసం కేసీఆర్ వద్దే హరీశ్, కేటీఆర్ కొట్టుకుంటున్నరట. పైకి మాత్రం బావా బావా అంటూ నటిస్తున్నరు. అందుకే హరీశ్, కేటీఆర్‌లను వేర్వేరుగా పిలిచి నీకంటే నీకే సీఎం పదవిస్తానంటూ కేసీఆర్ ఊరిస్తున్నడు. ఇటు రేవంత్‌కు కూడా ఆయన సన్నిహితులతో ఫోన్ చేయించి నువ్వే సీఎం అని చెప్పిస్తున్నడు. కేటీఆర్ అహంకారాన్ని చూసి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఆయన్ను ప్రచారానికి వద్దంటున్నారు. ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎసను ప్రజలు నమ్మబోరు" అని వ్యాఖ్యానించారు.

**కాంగ్రెస్ అమ్ముడుపోయే పార్టీ: కిషన్‌రెడ్డి**

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కేసీఆర్ కుటుంబానికి అమ్ముడుపోయే వారిగా ఉండిపోతారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. "కాంగ్రెస్ అమ్ముడుపోయే పార్టీ అయితే బీఆర్ఎస్ కొనే పార్టీ.. కాంగ్రెసకు ఓటేస్తే బీఆర్ఎసకు వేసినట్లే.. బీఆర్ఎసకు ఓటేస్తే కాంగ్రెసకు వేసినట్లే.. ఈరెండింటికి వేస్తే మజ్లిసకు వేసినట్లే.. షెడ్యూల్ వచ్చిన తర్వాత రాజకీయ పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. కేసీఆర్ ప్రభుత్వం పోవాలని అన్ని వర్గాలు కంకణం కట్టుకున్నాయి. బీఆర్ఎస్ వ్యతిరేక ఓటు చీల్చేందుకు మజ్లిస్ నాటకమాడుతోంది. మేం అధికారంలోకి రాగానే బెల్ట్‌షాపులను రద్దు చేస్తాం. బీఆర్ఎస్ అవినీతితో దోచుకున్న ప్రజాధనాన్ని రికవరీ చేస్తాం. రాష్ట్ర ప్రజలు బీజేపీ పాలననే కోరుకుంటున్నారు" అని స్పష్టం చేశారు. బీసీల ఓట్లు అడిగే నైతిక హక్కు బీఆర్ఎస్, కాంగ్రెసకు లేదని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కులగణన పేరుతో కాంగ్రెస్ మొసలి కన్నీరు కారుస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో 54 శాతమున్న బీసీలకు కేసీఆర్ 3 మంత్రి పదవులే ఇచ్చి అన్యాయం చేశారన్నారు. రాజకీయంగా బీసీల అభ్యున్నతికి బీజేపీనే పెద్ద పీట వేసిందని చెప్పారు. అక్రమంగా సంపాదించిన కోట్లాది రూపాయలతో కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యులు ఈటల రాజేందర్ దుయ్యబట్టారు. అధికారం లేకుండా కేసీఆర్ బతకలేరని, ఒక్కో సెగ్మెంటులో రూ.వంద కోట్ల వరకు ఖర్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇతర పార్టీల నేతలను స్థాయిని బట్టి వెలకట్టి కొంటున్నారని మండిపడ్డారు. తన బంధువర్గానికి చెందిన అధికారులను కీలక పదవుల్లో ఉంచుకుని వారి ఆధ్వర్యంలో పోలీసు వాహనాల్లో డబ్బులు పంపిణీ చేసేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

# కేసీఆర్‌పై పోటీ చేస్తా!

(మొదటి పేజీ తరువాయి)



రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రాకపోవచ్చుగానీ ప్రజల బాధలు తీర్చేవాడిని..'అని ఈటల అన్నారు. కొత్త రాష్ట్రంలో మంచి రాజకీయ వాతావరణాన్ని పాడుచేసిన దుర్మార్గపు పార్టీ.. భారత్ రాష్ట్ర సమితి అని ఆరోపించారు. 'హుజూరాబాద్‌లో హోదా ఉన్నవాడితో కొట్లాడతాంగానీ సైకోతో ఏం కొట్లాడుతాం.. పొలిటికల్ లీడర్ పొలిటికల్‌గా కొట్లాడాలి..'అన్నారు. ఎన్నికల ప్రక్రియ ఎన్నికల కమిషన్ చేతిలో ఉంటుందని, మొన్నటితో వారి పీడ విరగడైందని పేర్కొన్నారు. 'కొట్టడం చేతకాక కాదు.. కార్యకర్తలు కేసుల చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆగాను. కొట్లాట నా సంస్కృతి కాదు. ఎందుకంటే నేను పొలిటికల్ లీడర్‌ను. గూండాను కాదు. రౌడీని కాదు'అని అన్నారు. కొంతమంది చిల్లరగాళ్లు తను కేసీఆర్ కోవర్టు అని ఇంకా మాట్లాడుతుంటే బాధగా ఉందన్నారు. కేసీఆర్ వల్ల నరకం అంటే ఏమిటో సంపూర్ణంగా అనుభవించిన వాడినని తెలిపారు. తన శక్తిని మొత్తం బీఆర్ఎస్ ఓటమికి వినియోగిస్తానన్నారు. ఏ పోలీస్ ఆఫీసర్ అయినా బెదిరిస్తే చమడాలు తీస్తాం.. జాగ్రత్త.. అని చెప్పాలంటూ కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. అధికారులు పిచ్చి పనులు చేసినా.. పక్షపాతంతో వ్యవహరించినా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. తన వాళ్ల మీద చెయ్యి పడినా అంతు చూసేవరకూ వదిలిపెట్టేది లేదన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ రాదన్నారు. ఈనెల 16న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హుజూరాబాద్‌కు రాబోతున్నారని, సభను గొప్పగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# అక్కచెల్లెమ్మలకళ్లల్లో సంతోషాన్ని చూస్తున్నా..

(మొదటి పేజీ తరువాయి)

పథకం కింద తొలి విడతగా 7.43 లక్షల గృహ నిర్మాణాలను పూర్తి చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్ గురువారం కాకినాడ జిల్లా సామర్లకోట ఈటీసీ లేఅవుట్‌లో జరిగిన పేదల సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్నారు. అనంతరం స్థానిక జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహించిన సభలో లబ్ధిదారులైన మహిళలు, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మన ప్రభుత్వం అక్కచెల్లెమ్మలకు ఉచితంగా ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో 5.85 లక్షల సాధారణ ఇళ్లు, టిడ్కో కింద మరో 1,57,566 లక్షలు కలిపి మొత్తం సుమారు 7.43 లక్షల గృహాల నిర్మాణాన్ని ఇప్పటివరకు పూర్తి చేశాం. రాష్ట్రవ్యాప్తంగా మరో 14,33,000 ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ప్రతి పేదవాడి ముఖంలోనూ, అక్కచెల్లెమ్మల ముఖంలోనూ చిరునవ్వులు చూస్తున్నాం. దేవుడిని నేను ఇంతకన్నా ఏం అడగగలను? దేవుడు నాచేత పేదింటి అక్కచెల్లెమ్మలకు ఇంత మంచి చేసే అవకాశాన్ని ఇచ్చినందుకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటా. సామర్లకోటలో పేదల కోసం నిర్మించిన ఇళ్లను చూశా. ఆ ఇళ్లను చూసి లే అవుట్‌లో నాన్న గారి విగ్రహాన్ని ప్రారంభించి వస్తున్నప్పుడు ఇక్కడ ఇంటి స్థలం ధర ఎంత ఉందని దొరబాబును (హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్) అడిగా. కేవలం ఇంటి స్థలం విలువ అక్షరాలా రూ.12 లక్షలు పలుకుతోందని దొరబాబు చెప్పాడు. అక్కడ 54 ఎకరాల లేఅువుట్‌లో పేదలకు 2,412 ఇళ్ల స్థలాలిచ్చాం. ఇప్పటికే వెయ్యికిపైగా ఇళ్లు పూర్తై గృహ ప్రవేశాలు చేశారు.

**రూ.32 వేల కోట్లతో కనీస వసతులు..**

రాష్ట్రంలో 21.76 లక్షల గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ప్రతి పేదవాడికీ ఇచ్చే ఇల్లు కట్టడానికి అయ్యే ఖర్చు రూ.2.70 లక్షలు. ఇందులో రూ.1.80 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇస్తూ మరో రూ.35 వేలు పావలా వడ్డీకే రుణాలు వచ్చేటుట్టు చేశాం. ఉచితంగా ఇసుక సరఫరా చేస్తున్నాం. దాని విలువ మరో రూ.15 వేలు ఉంటుంది. సిమెంట్, మెటల్ ఫ్రేమ్స్, స్టీల్ తదితర నిర్మాణ సామగ్రి అంతా కూడా ధర తగ్గించి ఇవ్వడం వల్ల ప్రతి అక్కచెల్లెమ్మకు మరో రూ.40 వేల దాకా మేలు జరుగుతోంది. మొత్తం కలిపి ఒక్కో ఇంటికి రూ.2.70 లక్షలవుతుంది. ఇంటి స్థలం, ఇళ్లు కట్టించి ఇవ్వడంతో పాటు డ్రెయినేజీ, రోడ్లు, నీటి సురుఘురా, కరెంట్ సరఫరా లాంటి కనీస వసతుల కోసం మరో రూ.32 వేల కోట్లను ఖర్చు చేస్తున్నాం.

**మనసున్న ప్రభుత్వం...**

ఇంతకు ముందెప్పుడూ జరగనిది ఈరోజు జరుగుతోందంటే అందుకు కారణం.. కేవలం ముఖ్యమంత్రి మారాడు. ఆనాడు ఉన్న ముఖ్యమంత్రికి, ఈనాడు ఉన్న ముఖ్యుమంత్రికి మధ్య తేడా చూడండి. నేడు ఉన్న ముఖ్యమంత్రికి మనసు ఉంది. మీపట్ల అభిమానం, బాధ్యుత ఉంది. ఇదొక్కటే గత ప్రభుత్వానికి, మీ బిడ్డకు ఉన్న తేడా. అలాంటి మనసున్న ప్రభుత్వం మనందరిది కాబట్టే ప్రతి అక్కచెల్లెమ్మకూ ఒక శాశ్వత చిరునామా ఉండాలని అనుకున్నా.

# మేం రాగానే మిత్తితో చెల్లిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతోందని మండిపడ్డారు. మరో 45రోజుల్లో తమ పార్టీ కార్యకర్తలకు మంచి రోజులు రాబోతున్నాయన్నారు. అప్పుడు అధికారులందరి సంగతి తేలుస్తామని, వారికి సైతం మిత్తీతో సహా ఇస్తామని హెచ్చరించారు. కాంగ్రెసకు అనుకూలంగా ఉన్న వారిపై, కాంగ్రెస్ నాయకుల ఫోన్లపై సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు నిఘా పెట్టారని ఆరోపించారు. ఎన్నికల నేపథ్యంలో డీజీపీ అంజనీకుమార్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు. అర్వింద్‌కుమార్, జయేశ్‌రంజన్, సోమేశ్‌కుమార్ వంటి అధికారులు చందాలు అడుగుతున్నారని విమర్శించారు. అధికారులు ఇప్పటికైనా బీఆర్ఎస్ కార్యకర్తల్లా వ్యవహరించొద్దని సూచించారు. తెలంగాణలో డిసెంబరు 9న ఇందిరమ్మ రాజ్యం ఏర్పడడం, ఎల్బీస్టడియంలో ఆరు గ్యారంటీలపై సంతకం పెట్టడం... ఖాయమని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని, సెప్టెంబర్ 17న సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసి తీరుతామని స్పష్టంచేశారు. "కాంగ్రెస్ ఏం చేసిందంటూ బిల్లా-రంగాలు(కెటీఆర్-హరీషరావు) కుక్కల్లా మొరుగుతున్నారు. మీ నాన్న సీఎం, నువ్వు మంత్రి అయ్యావంటే.. అది సోనియా పెట్టిన భిక్ష. వ్యవసాయానికి ఉచిత కరెంటు, రైతులకు రుణమాఫీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలను అమలు చేసింది కాంగ్రెస్ కాదా?" అని నిలదీశారు. కాగా, ఎల్బీనగర్ టికెట్ రాకపోవడంతో బీఆర్ఎస్ నేత ముద్దగొని రామ్మోహన్‌గౌడ్, కంటోన్మెంట్‌లో టికెట్ ఆశించి భంగపడ్డ శ్రీ గణేష్ కొంతకాలంగా అసంతృప్తితో ఉన్నారు. కాంగ్రెసలో వీరి చేరికతో బీఆర్ఎసకు ఇబ్బందులు తప్పవనే వాదన వినిపిస్తోంది. కాగా, అధికార పార్టీ అడుగులకు మడుగులొత్తే అధికార యంత్రాగంపై విశ్వాసం సన్నగిల్లిన నేపథంలో రాష్ట్రపతి పాలన విధించి, ఆ తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని టీపీసీసీ నేత జి.నిరంజన్ డిమాండ్ చేశారు. పలువురు అధికారులను బదిలీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించడం..బీఆర్ఎస్ సర్కార్‌కు చెంపపెట్టు అన్నారు. కాగా, ఎన్నికల నేపథ్యంలో గాంధీభవన్ ఆవరణలో కాంగ్రెస్ వార్‌రూం ఏర్పాటైంది.

**అభ్యర్థుల ఎంపికపై అభిప్రాయ సేకరణ పూర్తి**

అభ్యర్థుల ఎంపికపై డీసీసీలు, రాష్ట్ర స్థాయి నాయకులందరి అభిప్రాయాలను స్క్రీనింగ్ కమిటీ సేకరించిందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఢిల్లీలో శుక్రవారం కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ(సీఈసీ) సమావేశం ఉందని, అందుబాటులో ఉండాలని ఆదేశాలు అందాయని చెప్పారు. అందుకే శుక్రవారం ఉదయాన్నే ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల ప్రకటన ఎప్పుడు అనేది తన చేతుల్లో లేదని, సీఈసీలో నిర్ణయిస్తారని స్పష్టం చేశారు.

# చిల్వకోడూరు, దట్నూర్ గ్రామాల్లో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమం





**జగిత్యాల, పృథ్వి న్యూస్ :** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలంలోని చిల్వకోడూర్,దట్నూర్ గ్రామల్లో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని జగిత్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆద్వర్యంలో గురువారం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షులు లక్ష్మణ్ కుమార్ మండల నాయకులతో కలిసి ప్రతి ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఒక దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని,దళితులకు మూడు ఎకరాల భూమిని ఇస్తానని,ఇంటికో ఉద్యోగం ఇస్తామని,నిరుద్యోగులకు భృతి ఇస్తామని చెప్పి ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి కేసిఆర్ విస్మరించారని విమర్శించారు.ధర్మపురి దేవస్థానాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేస్తామని, వెంటనే 5వందల కోట్ల రూపాయలు మంజూరు చేస్తామని చెప్పడం జరిగిందని ఇప్పటివరకు ఆలయ అభివృద్ధికి ఎన్ని నిధులు ఖర్చు చేశారో ధర్మపురి ఎమ్మెల్యే,మంత్రి కొప్పుల ఈశ్వర్ చెప్పాలని, ఒక మంత్రి హెూదాలో ఉన్న కొప్పుల ఈశ్వర్ చిల్వకొడుర్,దట్నూర్ గ్రామాల్లో ఎంత మందికి డబుల్ బెడ్రూం ఇల్లు కట్టి ఇచ్చారో,ఎంత మంది అర్హులైన పేద దళిత కుటుంబాలకు దళిత బందు ఇచ్చారో చెప్పాలని లక్ష్మణ్ కుమార్ నిలదీశారు.మిల్లర్ల చేతిలో ఈ ప్రాంత రైతాంగం దోపిడీకి గురవుతున్న మంత్రి కనీసం స్పందించలేదని,కాళేశ్వరం లింక్ 2 కింద మూడు పంటలు పండే వందలాది ఎకరాల సాగు భూమిని అధికారులను,పోలీసులను పెట్టి రైతును భయభ్రాంతులకు గురి చేసి వారి నుండి లాక్కుంటే కొప్పుల ఈశ్వర్ అట్టి విషయం మీద ఎందుకు మాట్లాడలేదని అడ్లూరి లక్ష్మణ్ ప్రశ్నించారు. మంత్రి కొప్పుల కు ఎంత వాట ఉందో చెప్పాలని అన్నారు.కాంగ్రెస్ పార్టీ హయాంలో రైతులను ఎటువంటి ఇబ్బందులకు గురి చెయ్యకుండా వడ్లను కొనుగోలు చేయడం జరిగిందని,కాంగ్రెస్ పార్టీ హయాంలో పార్టీలకు అతీతంగా ఇల్లు మంజూరు చేయడం జరిగిందని,మహిళలకు ఉచిత బస్ ప్రయాణం,5వందలకే సిలిండర్,రైతులకి క్వింటాలుకు అదనంగా 500 రూపాయల సహాయం,200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్,ఆరోగ్యశ్రీ పరిధి పెంపు,ప్రతి మహిళకు చేయూత కింద 4వేల రూపాయల ఆర్థిక సహాయం,రేషన్ కార్డులను పంపిణీ నిరంతరంగా కొనసాగింపు,వంటి ఎన్నో కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తుందని తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇచ్చిన ప్రతి హామినికి అమలు చేస్తామని,ప్రతి ఒక్కరు హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి,సర్పంచ్ చిర్ర గంగాధర్,సర్పంచ్,రేవెళ్ళ సత్యనారయణ,సర్పంచ్ తిరుపతి రెడ్డి రాజ్యలక్ష్మి,ఉప సర్పంచ్ వెంకటేష్,ఉప సర్పంచ్ శ్రీధర్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతి,టౌన్ అధ్యక్షులు మహేష్,మాజీ సర్పంచ్ నారాయణ,మాజీ సర్పంచ్ రాజేశ్వర్, గ్రామ శాఖ అధ్యక్షులు కొమురయ్య, లక్ష్మీపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు తిరుపతి, ముజ్జు,అశోక్,ములకల శ్రీనివాస్, తడగొండ విజయ్,గంగాధర్,స్వామి,శేఖర్,రమేష్,జాన్, గంగారాం,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలలో సిబ్బందికి, ఓటర్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

**అదనపు కలెక్టర్, డిప్యూటి ఎన్నికల అధికారిణి బి.ఎస్. లత**

**జగిత్యాల టౌన్/ పృథ్వి న్యూస్:** పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి, ఓటర్లకు మౌళిక సదుపాయాలు కల్పించాలని అదనపు కలెక్టర్, డిప్యూటి ఎన్నికల అధికారిణి బి.ఎస్. లత అన్నారు.గురువారం కలెక్టరేట్ లోని తన చాంబర్ నుండి ఆర్డీఓలు, పలు శాఖల ఇంజనీరింగ్ అధికారులు, తహశిల్దార్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవంబర్ లో జరుగనున్న శాసన సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పోలింగ్ కేంద్రాలలో త్రాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు, ర్యాంపులు, రేలింగ్స్, ఫర్నిచర్ వంటి సౌకర్యాలపై ఆయా మండల తహశిల్దార్లతో సమీక్షిస్తూ, పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు ఉండే విధంగా ఆయా ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకొని ఏర్పాట్లు పూర్తీ చేయాలని ఆదేశించారు. దివ్యాంగులకు ర్యాంపుల ఏర్పాట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో గల పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరా వివరాలను పరిశీలించి స్విచ్ బోర్డ్ లను, ఫ్యాన్లు నడిచే విధంగా ఏర్పాట్లు చేపట్టాలని, లేని యెడల అవసరమైన మరమ్మతులు చేయించాలని జిల్లా విద్యా శాఖ అధికారిని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోని మరుగు దొడ్లు లేని పోలింగ్ కేంద్రాలలో ఉపాధి హామీ పథకం కింద నిర్మాణాలు చేపట్టాలని పంచాయతి రాజ్ ఇంజనీరింగ్ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికలను సజావుగా, ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పూర్తీ ఏర్పాట్లు త్వరితగతిన పూర్తీ చేయాలని అధికారులను ఆదేశించారు. మండల తహశీల్దార్లు పోలింగ్ కేంద్రాలలోని వసతులను పరిశీలించాలని సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పోలింగ్ కేంద్రాలలో



అవసరమైన ఏర్పాట్లకు సంబంధించిన పనులను ఆయా ఇంజనీరింగ్ అధికారులు సకాలంలో పూర్తీ చేసి నివేదికలు సమర్పించాలని పేర్కొన్నారు.ఈ జూమ్ కాన్ఫరెన్సులో ఆర్డీఓలు నరసింహ మూర్తి, రాజేశ్వర్ , వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా అధికారులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

# సి విజిల్ పై ప్రజలకు అవగాహన కల్పించాలి.

**జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా**

**జగిత్యాల,పృథ్వి న్యూస్ :** సి విజిల్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని, డబ్బు, మద్యం, బహుమతులు, అక్రమ రవాణా లను అరికట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం రోజున సాయంత్రం %×ణుాజ% సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శాసనసభ ఎన్నికల దృష్ట్యా జిల్లాలోనీ ప్రజలకు సి విజిల్ యాప్ పై విస్తృత అవగాహన కల్పించాలని, జిల్లాలో ఎక్కడ అయిన అక్రమ మద్యం, డబ్బు, సరుకుల పంపిణీ, రవాణా జరిగినపుడు సాధారణ ప్రజలు కూడా సి విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదు దారుని సమాచారం గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. 50 వేల రూపాయలకు మించి ఆధారాలు లేని డబ్బులను పరిశీలించి సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. 10 లక్షలకు పైన ఉన్న డబ్బుకు సంబంధించి ఇన్ కం టాక్స్ శాఖ అధికారులకు తెలియజేయాలని అన్నారు. ఫోటో లేదా వీడియో, ఇతరత్రా ల ద్వారా ఫిర్యాదును యాప్ ద్వారా పంపవచ్చని తెలిపారు. అట్టి సమాచారం మేరకు సమీపంలోని ఫ్లయింగ్ స్వాడ్ ఆ ప్రాంతానికి చేరుకొని అట్టి వాటిని పంచనామా, వీడియో గ్రఫీ చేస్తూ స్వాధీనం చేసుకోవడం, వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లో అప్పగించడం జరుగుతుందని, డబ్బుకు సంబంధించిన వాటి నోట్లను డినామినేషన్ తప్పని సరిగా నమోదు చేయాలని, రవాణా చేస్తున్న వారి సంతకం కూడా తీసుకోవాలని తెలిపారు. అట్టి సరుకు, డబ్బు నిజంగా అన్ని రుజువులు ఉన్న ట్లయితే జిల్లా కమిటీ కి అప్పీలు చేసుకునే విధంగా తెలియ పరచాలని సూచించారు. ఏదైనా సమాచారం జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు తెలియ జేయాలనుకునే వారి కంట్రోల్ రూం నెంబర్ 1800 425 7620 కు గాని, 1950 కు గాని కాల్ చేసి తెలియపరచ వచ్చని అన్నారు. జిల్లాలోని గోదాములను తనిఖీ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలో అధిక మొత్తంలో బ్యాంక్ ఖాతాల నుండి లావాదేవీలు జరిగిన వివరాలు, కొత్తగా ప్రారంభించిన ఖాతాల వివరాలు సమర్పించాలని బ్యాంక్ అధికారి నీ ఆదేశించారు. శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. జిల్లాలో 18 ఫ్లయింగ్ టీమ్ లు రౌండ్ ద క్లాక్ పనిచేస్తాయని, సర్వైలేన్స్ టీమ్ లు, ఇతర టీమ్ లు నిరంతరంగా ఎన్నికల నిర్వహణ సమయంలో



పనిచేస్తాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత, దివాకర, ఆర్డీఓ లు రాజేశ్వర్, నరసింహ మూర్తి, డి ఎస్ పి వెంకట స్వామి, ఎల్డిఎం వెంకట్ రెడ్డి, ఇన్ కమ్ టాక్స్ అధికారి మేరీ, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ఆత్మీయ సమ్మేళనం

**ఎల్బీనగర్ అక్టోబర్ 12/పృథ్వి ప్రతినిధి:** వంగ శంకరమ్మ గార్డెన్స్ నందు జరిగిన గిరిజన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి .ఈ సందర్భంగా గిరిజన పెద్దలు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సుధీర్ రెడ్డి ని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటాము అని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు .కేసీఆర్ 10 కోట్ల రూపాయల వ్యయంతో మీకు బంజారా భవన్ నిర్మించడం జరిగింది అని గుర్తు చేశారు.గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా చేసిన ఘనత సీఎం కేసీఆర్ దే అని తెలిపారు.తెలంగాణలో ఎన్నికలు ఏమైనా విజయం బిఆర్ఎస్ పార్టీదే.రాష్ట్రంలో అన్ని సర్వేలు బిఆర్ఎస్ పార్టీకే అధికారాన్ని చూపిస్తున్నాయి.రాష్ట్రంలో మూడవసారి బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యం అని తెలిపారు.తెలంగాణలో బిజెపి పార్టీకి ఉనికి లేదు,కాంగ్రెస్ పార్టీకి క్యాడర్ లేదని అన్నారు.2014లో రాష్ట్ర ప్రజలు ఉద్యమ నాయకుడిని పట్టం కట్టారని తెలిపారు.9 ఏళ్లలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించింది.దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తుంది అని తెలిపారు.రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శం.దేశం మొత్తంలో రెండుసార్లు రైతులకు రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కెసిఆర్ ప్రభుత్వం అని తెలిపారు.పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకం ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్ దే అని తెలిపారు.వ్యవసాయానికి పెట్టుబడి సాయం చేసి రైతులను రాజును చేసిన ప్రభుత్వం కెసిఆర్ ప్రభుత్వం.పేద వర్గాల సంక్షేమం కోసం 200 రూపాయలు ఉన్న పింఛన్ను 2000 రూపాయలకు పెంచడంతో పాటు రాష్ట్రంలో 45 లక్షల మందికి ఆసరా పింఛన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం బిఆర్ఎస్ ప్రభుత్వం.6 ఏండ్లలో 65 వేల కోట్ల పెట్టుబడి సాయం అందించిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం.కాంగ్రెస్,బిజెపిలు రాష్ట్రంలో అధికారం కోసమే పాకులాడుతున్నాయే కానీ తెలంగాణ అభివృద్ధి కోసం మాత్రం కాదు అని తెలిపారు.కావున కేసీఆర్ ప్రభుత్వ పాలనను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.తనను మరోసారి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని విజ్ఞప్తి చేశారు.కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మరియు పలువురు గిరిజన పెద్దలు తదితరులు పాల్గొన్నారు.





# అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం.

**సైదాబాద్ అక్టోబర్ 12/పృథ్వి ప్రతినిధి:** అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కామినేని హాస్పిటల్ వారిచే ఐ. యస్. సదన్ డివిజన్ లక్ష్మి నగర్ కాలనీ సాయిబాబా దేవాలయం లో ఉచిత వైద్య శిబిరం విశేష స్పందన వచ్చింది బి. పి. షుగర్ పరీక్షలు చేసి మందులు కూడ ఉచితంగా అందజేశాము ఈ కార్యక్రమం లో దేవాలయ కమిటీ సభ్యులు నేరెళ్ల ప్రసాదరావు. డాక్టర్స్. వేమంత. ఫలాక్. సిస్టర్స్. శిరీష. ప్రవళిక. అల్సా. మార్కెటింగ్. బాలకృష్ణ. అమ్మ ఫౌండేషన్ చైర్మన్. నాగమల్ల అనిల్ కుమార్ పాల్గొన్నారు.ద

# అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించిన దోరేపల్లి శ్వేత



**నాయుడుపేట అక్టోబర్ 12: పృథ్వీ ప్రతినిధి:** ఖమ్మం రూరల్ మండలం లోని పరిసర గ్రామాలలో బుధవారం నాడు ఖమ్మం ఏఎంసి చైర్మన్ 58 వ డివిజన్ కార్పొరేటర్ దోరేపల్లి శ్వేత విస్తృతంగా పర్యటించారు. ఈ క్రమంలో నాయుడుపేట గ్రామానికి చెందిన దండు శ్రీనివాస్' పదిరి సీతయ్య లు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న శ్వేత వారి ఇండ్లకు వెళ్లి వారి ఆరోగ్య విషయం గురించి వివరాలు తెలుసుకొని కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. మీకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా నేనున్నాను మీకు నేను ఆసరా అవుతానని ఆమె వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ బాలికా దినోత్సవం





**నల్లగొండ అక్టోబర్ 12: పృథ్వి ప్రతినిధి:** ప్రతి సంవత్సరం అక్టోబరు 11న జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించబడుతోంది. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, అనర్థాలను నివారించి, వారి హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించింది. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలియజేయడమేకాకుండా, సమస్యలు పరిష్కరించబడినప్పుడు జరిగే పరిణామాల గురించి కూడా అవగాహన పెంచడానికి ఈ దినోత్సవం ఉపయోగపడుతోంది. బాలికలను విద్యావంతులను చేసి, బాల్య వివాహాలు తగ్గించడంలో, విద్యను అభ్యసించిన బాలికలు అధిక వేతనాలతో ఉద్యోగాలు పొందడంలో మార్గదర్శకంగా నిలవడం ద్వారా మహిళత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కూడా సహాయపడుతోంది. 2012 అక్టోబరు 11న తొలిసారిగా ఈ దినోత్సవం జరుపబడింది. ప్రపంచవ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస, బలవంతపు వివాహం పై, వివక్షత పై, బాల్య వివాహం పై, అవగాహన పెంచడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం. బాలికలు, యువతులు వారివారి రంగాలలో ప్రచారం, పరిశోధనలకు సంబంధించి సాధించిన అభివృద్ధిని ప్రతిబింబించేలా జరుగుతాయని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.దీప్తి తెలిపారు. ఈ కార్యక్రమం బీసీ గర్ల్స్ హాస్టల్, నల్లగొండ లో నిర్వహించడం జరిగింది. సఖి కేంద్రం నిర్వాహకులు మందాకిని, షీ టీం ఎస్.ఐ అంజలి, బీసీ గర్ల్స్ హాస్టల్ వార్డెన్, పారా లీగల్ వాలంటీర్లు బి. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గుండెల నిండా గులాబీ జెండాతో ఘనమైన విజయం సాధిద్దాం

**దశబ్దాల ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించింది మనమే, మళ్ళీ గెలిచేది మనమే**

**వికారాబాద్ అక్టోబర్ 12: పృథ్వి ప్రతినిధి:** గురువారం వికారాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్, చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి, వికారాబాద్ జిల్లా, బ్రష్ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ వికారాబాద్ జిల్లా కేంద్రంలోని, జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... బాధ్యతల వారీగా ప్రతి నాయకుడు, కార్యకర్త కటోర లక్ష్యసాధనతో పనిచేద్దాం అని, బి.ఆర్.ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్ నాయకత్వాన్ని బలపరుస్తూ... భారీ మెజారిటీతో మరోసారి గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# సఫారీలు.. కంగారెత్తించారు





లఖ్‌నవూ: తాజా వన్డే ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా అంచనాలకు మించే రాణిస్తోంది. అటు బ్యాటింగ్.. ఇటు బౌలింగ్‌లో సమష్టిగా కదం తొక్కుతూ ప్రత్యర్థి జట్లను వణికిస్తోంది. గురువారం ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 134 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. డికాక్ (106 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్సర్లతో 109) బ్యాట్ నుంచి మరో శతకం నమోదు కాగా.. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 7 వికెట్లకు 311 పరుగులు చేసింది. మార్‌క్రమ్ (44 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 56) అర్ధసెంచరీ పూర్తి చేశాడు. మ్యాక్స్‌వెల్, స్టార్క్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత భారీ ఛేదనలో ఆసీస్ 40.5 ఓవర్లలో 177 పరుగులకు ఆలౌటైంది. లబుషేన్ (46) మాత్రమే ఆకట్టుకున్నాడు. రబాడకు మూడు.. కేశవ్, షంసీ, జాన్సెన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా డికాక్ నిలిచాడు.దఅటు పేస్.. ఇటు స్పిన్: కొత్త బంతితో పేసర్లు స్వింగ్‌తో పాటు సీమ్‌ను రాబట్టడంతో పాటు స్పిన్నర్లు కూడా టర్న్ సాధించడంతో ఆసీస్ బ్యాటర్లు కంగారెత్తారు. ముఖ్యంగా రబాడ పిచ్‌ను చక్కగా సద్వినియోగం చేసుకుంటూ కీలక వికెట్లతో భరతం పట్టగా.. ఎన్‌గిడి అత్యంత పొదుపు (8-2-18-1)గా బౌలింగ్ చేశాడు. వీరి ధాటికి లబుషేన్ మాత్రమే ఫర్వాలేదనిపించాడు. ఓపెనర్లు మార్ష్ (7), వార్నర్ (13) వరుస ఓవర్లలో వెనుదిరిగారు. అప్పటికి స్కోరు 23 పరుగులు మాత్రమే. స్మిత్ (19)ను రబాడ ఎల్బీ చేయడంతో పవర్‌ప్లేలోనే ఆసీస్ టాపార్డర్‌ను కోల్పోయింది. ఈ దశలో ఓ వైపు వికెట్లు టపటపా పడుతున్నా.. లబుషేన్ మాత్రం ఒంటరి పోరాటం చేశాడు. మ్యాక్స్‌వెల్ (3)ను కేశవ్ రిటర్న్ క్యాచ్‌తో, స్టొయినిస్ (5)ను రబాడ అవుట్ చేయడం దెబ్బతీసింది. అయితే చివర్లో స్టార్క్ (27) నుంచి లబుషేన్‌కు సహకారం అందడంతో ఏడో వికెట్‌కు 69 పరుగులు జత చేరాయి. కానీ స్టార్క్‌ను జాన్సెన్.. లబుషేన్‌ను కేశవ్ వరుస ఓవర్లలో అవుట్ చేయడంతో ఆసీస్ 143/8 స్కోరుతో పీకల్లోతు కష్టాల్లో పడింది. చివర్లో కెప్టెన్ కమిన్స్ (22), జంపా (11 నాటౌట్) తొమ్మిదో వికెట్‌కు 32 రన్స్ జోడించినా ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగాయి. 41వ ఓవర్‌లో స్పిన్నర్ షంసీ.. కమిన్స్, హాజెల్‌వుడ్ (2) వికెట్లను తీసి ఆసీస్ ఇన్నింగ్స్‌ను ముగించాడు.

**డికాక్ మెరుపులు:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సఫారీలు ఆసీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. డికాక్-బవుమా (35) తొలి వికెట్‌కు 108 పరుగులు జత చేశారు. 20వ ఓవర్‌లో బవుమాను మ్యాక్స్ అవుట్ చేయడంతో ఇద్దరి శతక భాగస్వామ్యం ముగిసింది. డుస్సెన్ (26) ఉన్నకాసేపు వేగం చూపి జంపా చేతికి చిక్కాడు. ఇక 30వ ఓవర్‌లో భారీ సిక్సర్‌తో డికాక్ సెంచరీ పూర్తిచేశాడు. అనంతరం స్వల్ప వ్యవధిలోనే డికాక్‌ను మ్యాక్స్ బౌల్డ్ చేసినా.. మార్‌క్రమ్, క్లాసెన్ జోడీ మాత్రం విరుచుకుపడ్డారు. చివర్లో మిల్లర్ (17), జాన్సెన్ (26) సైతం విలువైన పరుగులు జోడించడంతో 300ం స్కోరుతో ప్రత్యర్థికి సవాల్ విసిరింది.



**5 క్యాచ్‌లు వదిలేశారు :** ఈ మ్యాచ్ చూసిన వారికి నిజంగా మైదానంలో ఆడుతోంది ఐదుసార్లు ప్రపంచకప్ గెలిచిన ఆస్ట్రేలియా జట్టేనా? అనే సందేహం రాకమానదు. దక్షిణాఫ్రికాపై పసలేని బ్యాటింగ్‌కు తోడు.. చెత్త ఫీల్డింగ్‌తో ఏకంగా ఐదు క్యాచ్‌లను జారవిడిచి ఓ పసికూన టీమ్ మాదిరి ప్రదర్శనతో ఆశ్చర్యపరిచింది. మార్‌క్రమ్ ఒక పరుగు దగ్గర ఉన్నప్పుడు కమిన్స్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చినా అందుకోలేకపోయాడు. ఆ తర్వాత మార్‌క్రమ్ చెలరేగి 44 బంతుల్లోనే 56 పరుగులతో అదరగొట్టాడు. ఆరంభంలో ఓపెనర్ బవుమా 19 రన్స్ దగ్గర ఇచ్చిన క్యాచ్‌ను కీపర్ ఇన్‌గ్లిస వదిలేశాడు. కాసేపటికే బౌండరీ దగ్గర మరో క్యాచ్‌ను సబ్‌స్టిట్యూట్ ఎబాట్ అందుకుని రోప్ దాటేశాడు. అంతలోనే తను లోపలికి విసిరినా అక్కడే ఉన్న స్టార్క్‌కు దూరంగా వెళ్లింది. అలాగే 48వ ఓవర్‌లో మిల్లర్ క్యాచ్‌ను స్టార్క్, జాన్సెన్ క్యాచ్‌ను స్టొయినిస్ వదిలేయడం ఆసీసను దెబ్బతీసింది.

దక్షిణాఫ్రికా: డికాక్ (బి) మ్యాక్స్‌వెల్ 109బీ బవుమా (సి) వార్న్ (బి) మ్యాక్స్‌వెల్ 35బీ డుస్సెన్ (సి-సబ్) ఎబాట్ (బి) జంపా 26బీ మార్‌క్రమ్ (సి) హాజెల్‌వుడ్ (బి) కమిన్స్ 56బీ క్లాసెన్ (సి) ఇన్‌గ్లిస (బి) హాజెల్‌వుడ్ 29బీ మిల్లర్ (బి) స్టార్క్ 17బీ జాన్సెన్ (సి) వార్నర్ (బి) స్టార్క్ 26బీ రబాడ (నాటౌట్) 0బీ కేశవ్ (నాటౌట్) 0బీ ఎక్స్‌ట్రాలు: 13బీ మొత్తం: 50 ఓవర్లలో 311/7. వికెట్ల పతనం: 1-108, 2-158, 3-197, 4-263, 5-267, 6-310, 7-311. బౌలింగ్: స్టార్క్ 9-1-53-2బీ హాజెల్‌వుడ్ 9-0-60-1బీ మ్యాక్స్‌వెల్ 10-1-34-2బీ కమిన్స్ 9-0-71-1బీ ఆడమ్ జంపా 10-0-70-1బీ మిచెల్ మార్ష్ 1-0-6-0బీ స్టొయినిస్ 2-0-11-0.

ఆస్ట్రేలియా: మార్ష్ (సి) బవుమా (బి) జాన్సెన్ 7బీ వార్నర్ (సి) వాన్ డర్ డుస్సెన్ (బి) ఎన్‌గిడి 13బీ స్మిత్ (ఎల్బీ) రబాడ 19బీ లబుషేన్ (సి) బవుమా (బి) కేశవ్ 46బీ ఇన్‌గ్లిస (బి) రబాడ 8బీ మ్యాక్స్‌వెల్ (సి అండ్ బి) కేశవ్ 3బీ స్టొయినిస్ (సి) డికాక్ (బి) రబాడ 5బీ స్టార్క్ (సి) డికాక్ (బి) జాన్సెన్ 27బీ కమిన్స్ (సి) మిల్లర్ (బి) షంసీ 22బీ జంపా (నాటౌట్) 11బీ హాజెల్‌వుడ్ (సి) రబాడ (బి) షంసీ 2బీ ఎక్స్‌ట్రాలు: 17బీ మొత్తం: 40.5 ఓవర్లలో 177 ఆలౌట్. వికెట్ల పతనం: 1-27, 2-27, 3-50, 4-56, 5-65, 6-70, 7-139, 8-143, 9-175, 10-177. బౌలింగ్: ఎన్‌గిడి 8-2-18-1బీ జాన్సెన్ 7-0- 54-2బీ రబాడ 8-1-33-3బీ కేశవ్ 10-0-30-2బీ షంసీ 7.5-0-38-2.

# పారా ఆసియా క్రీడలకు భారత బృందం పయనం



న్యూఢిల్లీ: ఆసియా క్రీడలు ముగిశాయి. ఇప్పుడిక పారా ఆసియా క్రీడలకు సమయం ఆసన్నమైంది. హాంగ్జౌ వేదికగా ఈనెల 22 నుంచి 28 వరకు నాలుగో పారా ఆసియా క్రీడలు జరగనున్నాయి. ఈ క్రీడల్లో 309 మందితో కూడిన భారత జట్టు బరిలో దిగుతోంది. వీరిలో 196 మంది పురుషులుకాగా 113 మహిళా అథ్లెట్లున్నారు. మొత్తం 17 విభాగాల్లో భారత క్రీడాకారులు తలపడుతున్నారు. కనోయింగ్, బ్లైండ్ ఫుట్‌బాల్, లాన్‌బౌల్స్, రోయింగ్, తైక్వాండోలో మొదటిసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. గత పారా ఆసియాడ్‌లో భారత్ మొత్తం 72 పతకాలు సాధించింది. ఈసారి అంతకు మించి రాణించాలని భావిస్తున్న మనోళ్లు..గురువారం హాంగ్జౌ పయనమయ్యారు. కేంద్ర మంత్రులు హర్దీప్ సింగ్ పురి, అనురాగ్ ఠాకూర్, భారత పారా ఒలింపిక్ కమిటీ చైర్మన్ దీపా మాలిక్ తదితరులు భారత అథ్లెట్లకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా భారత జట్టు పతాకధారికి జెర్సీని అందజేశారు. అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ 'పారా అథ్లెట్లకు ప్రభుత్వం అన్నివేళలా అండగా ఉంటుంది.



# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి**

**దంతాలపల్లి** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ప్రభుత్వాలను వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని చెప్తారని సిపిఐ జిల్లా కార్యదర్శినల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు గృహలక్ష్మి దళిత బంధు గిరిజన బంధు హామీలు ఇచ్చి ఓట్లలో మళ్ళీ గెలవడానికి ప్రభుత్వాలు ప్రజలను మభ్యపెడుతున్నాయని గతంలో అనేక హామీలు ఇచ్చి వాటిని మరిచిపోయిందని మర్చిపోయిందని ఆయన ఆరోపించారు ఇప్పటికైనా ప్రజలు గమనించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పొంగుల శ్రీనివాస్ గౌడ్, రామ్మూర్తి, సారయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కేన్ వచ్చేశాడు



**కివీస జట్టులో ఉత్సాహం**

**బంగ్లాదేశ్‌తో మ్యాచ్ నేడు**


**మ.2.గం స్టార్ స్పోర్ట్, డిస్నీ హాట్‌స్టార్‌లో..**

చెన్నై: ఆరంభ పోరులో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌కు షాకిచ్చిన ఆత్మవిశ్వాసం, రెండో పోరులో నెదర్లాండ్స్‌పై ఘన విజయం..వెరసి వరల్డ్ కప్‌లో న్యూజిలాండ్ జోరుమీదుంది. శుక్రవారం ఇక్కడ జరిగే మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను ఢీకొననుంది. మరోవైపు రెగ్యులర్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ పూర్తి ఫిట్‌నెస్ సాధించి ఈ మ్యాచ్‌తో పునరాగమనం చేయనుండడంతో కివీసలో ఉత్సాహం ఇనుమడించింది. ఇక తొలి రెండు మ్యాచ్‌లు ఆడని పేసర్ టిమ్ సౌథీ కూడా అందుబాటులో ఉంటాడు. టాపార్డర్‌లో విల్ యంగ్, డెవాన్ కాన్వే, డారెల్ మిచెల్ అద్భుత ఫామ్‌లో ఉన్నారు. మరోవైపు గత పోరులో ఇంగ్లండ్ చేతిలో భారీ తేడాతో ఓడిన బంగ్లాదేశ్..షకీబ్, మెహదీ హసన్, మెహదీ హసన్ మీర్జా స్పిన్ త్రయంతో కివీస్ పనిపట్టాలనుకుంటోంది. సీనియర్ బ్యాటర్లు షకీబ్, ముష్ఫికర్ రహీమ్, లిటన్ దాస్, నజ్మల్ షాంటోలు శాంట్నర్‌ను సమర్థంగా ఎదుర్కొని పరుగులు సాధించగలరని బంగ్లాదేశ్ భావిస్తోంది. కాగా.. వన్డేలలో ఈ రెండు జట్లు 41 సార్లు తలపడగా కివీస్ 30 సార్లు నెగ్గింది. 10 మ్యాచ్‌ల్లో బంగ్లా గెలవగా, ఒకటి రద్దయింది.

**భారత్ పిచ్‌లపై సవాలు..:కేన్**

భారత్‌లో భిన్నమైన పిచ్‌లకు అలవాటుపడడం సవాలేనని కివీస్ సారథి కేన్ విలియమ్సన్ అభిప్రాయపడ్డాడు. 'ఇక్కడ ఒక్కో వేదికలో ఒక్కో రకమైన వికెట్ ఉంటుంది. చెపాక్ పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తుంది. రెండు జట్లలో ఉన్న మంచి స్పిన్నర్లు ఈ మ్యాచ్‌లో కీలక పాత్ర పోషిస్తారు' అని అన్నాడు.

# మ్యాచ్ ఫీవర్..అహ్మదాబాద్ ఆసుపత్రులు ఫుల్



అహ్మదాబాద్: చిరకాల ప్రత్యర్థులు ఇండో-పాక్ మ్యాచ్ ఫీవర్ అహ్మదాబాద్‌ను కమ్మేసింది. ఈ పోరును వీక్షించడానికి అభిమానులు ఎంతో ఉత్సాహంతో తరలి వస్తున్నారు. అయితే, ఫ్యాన్స్ బసకు మాత్రం ఇబ్బందిగా మారింది. ఒకటీ అరా గదులు ఖాళీగా ఉంటున్నా అద్దెలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ నేపథ్యంలో..మ్యాచ్ కోసం ఇక్కడికి వచ్చే ఫ్యాన్స్ కొత్త ఆలోచన చేశారు. దాంతో ఓ రాత్రి ఉండే విధంగా జనరల్ చెకప్ ప్యాకేజీల పేరుతో ఆసుపత్రుల్లో చేరే వారి సంఖ్య అమాంతం పెరిగిపోయింది. ఫలితంగా సిటీలోని ఆసుపత్రులకు భారీ డిమాండ్ నెలకొంది. కానీ, ఇలాంటి వారిని గుర్తించి తిరస్కరిస్తున్నట్టు ఓ డాక్టర్ తెలిపాడు. మ్యాచ్ నేపథ్యంలో ఫంక్షన్ హాళ్లు, కమ్యూనిటీ భవనాలు కూడా లాడ్జీల్లా మారిపోగా.. యూనివర్సిటీ హాస్టళ్లు అతిథులతో కిటకిటలాడుతున్నాయట.




# ఇది 45 స్పెషల్

న్యూఢిల్లీ: క్రిస్ గేల్‌ను ఆదర్శంగా తీసుకునే అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు (556) బాదిన బ్యాటర్‌గా నిలిచినట్టు హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ తెలిపాడు. 'యూనివర్స్ బాస్ ఎప్పటికీ యూనివర్స్ బాస్‌గానే ఉంటాడు. నేను అతడి పుస్తకంలో నుంచి ఒక పేజీని మాత్రమే తీసుకున్నా. కాకతాళీయంగానైనా మేమిద్దరం ఒకే నెంబర్ (45) జెర్సీ వేసుకుంటాం. అతడి రికార్డును కూడా 45 జెర్సీనే అధిగమించడంతో సంతోషించే ఉంటాడు' అని రోహిత్ తెలిపాడు. అటు గేల్ కూడా ఇదే విషయాన్ని తెలుపుతూ గతంలో ఇద్దరూ తమ జెర్సీలతో దిగిన ఫొటోను షేర్ చేశాడు. 'అత్యధిక సిక్సర్లు బాదిన రోహిత్‌కు శుభాకాంక్షలు. ఇది 45 ప్రత్యేకం' అని అందులో తెలిపాడు. దీనికి రోహిత్.. 'మన జెర్సీలో 4, 5 నెంబర్లున్నా మనకి మాత్రం 6 (సిక్సర్లు) అంటేనే ఇష్టం' అని సరదాగా బదులిచ్చాడు.

Edited, Printed, Published & owned by GOSUKONDA PRUDHVIRAJU, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at Panidhar PUBLICATIONS. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: GOSUKONDA PRUDHVIRAJU,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in